క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

గూడూరు: మండలంలోని ఐదుగుళ్లపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.సుబ్బారావు సోమవారం తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ గ్రామంలోని ప్రతి గడపను సందర్శిస్తారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తారని వెల్లడించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

రథం నిర్మాణానికి పూజలు



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రథం నిర్మాణానికి ఆలయ ప్రధానార్చకుడు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేదపండితులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏసీ ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో రథ చక్రాలు, సామగ్రికి ఉదయం పసుపు, కుంకుమతో పూజలు చేసి టెంకాయ కొట్టి రథం నిర్మాణాన్ని ప్రారంభించినట్లు ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ తెలిపారు. ఏటా మాఘమాసంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణోత్సవం, అనంతరం గ్రామంలో రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో రెండు సంవత్సరాలు రథోత్సవం నిర్వహించలేదని గుర్తుచేశారు. ఈ ఏడాది భక్తుల కోరికపై రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

నాగేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.48 లక్షలు



కృత్తివెన్ను: శ్రీదుర్గ, పార్వతి సమేత నాగేశ్వర స్వామికి హుండీ ద్వారా రూ.4,48,036 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ తనిఖీదారు శ్రీనివాసరావు సమక్షంలో, ధర్మకర్తల పర్యవేక్షణలో హుండీ కానుకలను సోమవారం లెక్కించారు. పది నెలలకు ఈ ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకుడు మురళీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి వచ్చే అర్జీదారులకు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో తూము వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఎంయూడీఏ వీసీ బి.వి.నారాయణరెడ్డి, దివ్యాంగ సంక్షేమశాఖ ఏడీ బి.రామకుమార్, గిరిజన సంక్షేమశాఖాధికారి ముదిగొండ ఫణిదూర్జటి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.వి.శ్యామ్‌నాథ్ పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



నాగాయలంక: స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని పరాక్రమ్ దివస్‌ను సోమవారం నిర్వహించారు. మాతృభూమికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత దేశభక్తుడు సుభాస్‌చంద్రబోసును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ మాజీ సభ్యురాలు తలశిల స్వర్ణలత సూచించారు. నేతాజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు లకనం నాగాంజనేయులు, తలశిల లీలామనోహర్, టి.మోహన్‌కుమార్ చౌదరి, షేక్ జానీ, నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఉరుసు

మచిలీపట్నంటౌన్: స్థానిక జలాల్‌పేటలోని హజ్రత్ ఖాదర్‌వలీ నాగూర్‌వలీ ఐదో ఉరుసును అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవంలో భాగంగా సోమవారం దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం

మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని. చిత్రంలో కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ అపరాజితసింగ్ తదితరులు

కోనేరుసెంటర్: రాష్ట్రంలో పేదల సొంతింటి కల సాకారం అయ్యేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. బందరు మండలం పెదకరగ్రహారంలోని జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ.. అద్దె ఇళ్లు, కాలువ గట్లు, పోరంబోకు స్థలాల్లో నివసిస్తున్న లక్షల మంది పేదల సొంతింటి కలను నెరవేర్చాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల భూమిలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు పంపిణీ చేయటంతో పాటు ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేపట్టి అందిస్తోందన్నారు. మచిలీపట్నం నియోజకవర్గంలో 26 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరుచేశామని తెలిపారు. లబ్ధిదారులు వీలైనంత త్వరగా గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ.. ఎన్నికల వాగ్దానాలను నెరవేరుస్తూ జనరంజక పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలంతా అదృష్టవంతులేనన్నారు. జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ మాట్లాడుతూ.. లబ్ధిదారులు వీలైనంత త్వరగా గృహాలు నిర్మించుకోవాలని సూచించారు. పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ సిలార్‌దాదా, అర్బన్‌బ్యాంకు మాజీ చైర్మన్ బొర్రా విఠల్, డ్వామా పీడీ జి.వి.సూర్యనారాయణ, బందరు ఆర్డీఓ ఐ.కిషోర్, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా ఇన్‌చార్జ్ పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్, బందరు తహసీల్దార్ డి.సునీల్‌బాబు, మునిసిపల్ కమిషనర్ చంద్రయ్య, పలువురు కార్పొరేటర్లు, పలుశాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన పార్టీ నాయకుల్లో తిరుగుబాటు

- అభివృద్ధికి అడ్డుపడొద్దని మండల నాయకులకు హితవు
- ఉచితంగానే బుసక తోలుకుంటున్నామని స్పష్టీకరణ
- పార్టీ ముసుగులో విద్వేషాలను రెచ్చగొట్టడంపై ఆగ్రహం



జనసేన నాయకుల తీరుపై జగనన్న లేఅవుట్ వద్ద నిరసన తెలుపుతున్న ఆ పార్టీ నాయకులు, లబ్ధిదారులు

దక్షిణచిరువోలులంక(అవనిగడ్డ): పార్టీ ముసుగులో విద్వేషాలు రెచ్చగొట్టేందుకు చూస్తున్న జనసేన నాయకుల తీరును ఆ పార్టీ స్థానిక నాయకులు నిరసిస్తున్నారు. జగనన్న కాలనీల్లో స్థలాల మెరక కోసం బుసక తోలుకుంటుంటే పార్టీ నాయకులు అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. మండలంలోని దక్షిణ చిరువోలులంక పంచాయతీ పరిధిలో మేడిలంక, దక్షిణ చిరువోలులంక జగనన్న కాలనీల్లో పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి. ఈ కాలనీల్లో లబ్ధిదారులు తమ ఇళ్ల స్థలాలను మెరక చేసుకుంటున్నారు. వీరిలో జనసేన పార్టీ నాయకులు కూడా ఉన్నారు. మెరక పనులకు బుసక తోలాలని వైఎస్సార్ సీపీ నాయకుడు, సర్పంచ్ సనకా సుబ్రహ్మణ్యంను లబ్ధిదారులు కోరారు. దీంతో ఆయన తన సొంత పొలం నుంచి ఉచితంగా లేఅవుట్లకు బుసక తోలుతున్నారు. అయితే అక్రమంగా మైనింగ్ చేస్తున్నారంటూ జనసేన పార్టీ మండల కన్వీనర్ గుడివాక శేషుబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు కొంత మంది లేఅవుట్లకు బుసక తోలుతున్న ట్రాక్టర్లను అడ్డుకున్నారు. మండల నాయకుల తీరును తీవ్రంగా వ్యతిరేకించిన స్థానిక జనసేన నాయకుడు మత్తి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, లబ్ధిదారులు ఆదివారం లేఅవుట్ల వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో గుడి, బడి, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం.. ఇలా ప్రజలకు ఉపయోగపడే ఏ నిర్మాణం చేపట్టినా తన సొంత పొలం నుంచి మట్టి, బుసకను ఉచితంగా ఇచ్చే సర్పంచ్ సుబ్రహ్మణ్యంపై విష ప్రచారం చేయడం, విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేశారు. అభివృద్ధి పనులకు అడ్డుపడొద్దని జనసేన మండల నాయకులకు హితవు పలుకుతున్నారు.

ఉచితంగా తోలడం అక్రమమా?



ఇల్లు కట్టుకునేందుకు మెరక పనులకు అప్పు చేసి రూ.25 వేలు ఖర్చు పెట్టాను. డబ్బులు లేక, అప్పు పుట్టక సర్పంచ్‌ను అడిగితే ఉచితంగా బుసక తోలుకోమన్నారు. ఉచితంగా బుసక తోలుతుంటే జనసేన వారు అడ్డుకోవడం ఏమిటి? అదేమైనా అక్రమమా? పేదలు ఇల్లు కట్టుకోవడం వారికి ఇష్టం లేదా?

– రెడ్రౌతు వెంకటేశ్వరమ్మ, దక్షిణ చిరువోలులంక

జనసేన కార్యకర్తలూ లబ్ధిదారులే



మేడిలంకలో ఇచ్చిన జగనన్న లేఅవుట్లలతో జనసేన కార్యకర్తలూ లబ్ధిదారులుగా ఉన్నారు. సర్పంచ్ సుబ్రహ్మణ్యం సొంత పొలం నుంచి ఉచితంగా బుసక తోలుతుంటే పార్టీ మండల నాయకులు అడ్డుకోవడం ఎంత వరకు సమంజసం? పేదలు ఇళ్లు కట్టుకుంటుంటే అడ్డుపడటం పార్టీకి మంచిదేనా?

– మత్తి సుబ్రహ్మణ్యం, జనసేన నాయకుడు, మేడిలంక

అడ్డుకోవడం న్యాయమేనా?



బరంతు తోలకుండా ఇల్లు కట్టుకుంటే వరద వస్తే మునిగిపోతుంది. నేను ఇంటి నుంచి బయటకు రాలేను. డబ్బులు ఇచ్చి మట్టి తోలుకునే స్తోమతు లేదు. నాలుగు ట్రక్కులు మట్టి తోలాలని సర్పంచ్‌ను అడిగితే సరే అన్నారు. ఉచితంగా మెరక పనులు చేస్తుంటే అడ్డుకోవడం న్యాయమేనా?

– సమ్మెట ఆదిమ్మ, గృహనిర్మాణ లబ్ధిదారు, ఒడుగువానిపాలెం

జనసైనికుడిగా బాధపడుతున్నా



నేను ఇల్లు కట్టుకునేందుకు రెండు ట్రక్కుల బుసక ఉచితంగా తోలుకున్నాను. బుసక ఇంకా కావాలి. పేదలు ఇల్లు కట్టుకునేందుకు ఉచితంగా మెరక పనులు చేస్తున్న సర్పంచ్‌పై నిందలు వేయడం, విషప్రచారం చేయడం మంచిదా? కొంతమంది జనసేన పార్టీ నాయకుల తీరుకు జనసైనికుడిగా బాధపడుతున్నా.

– మట్టా రవి, గృహనిర్మాణ లబ్ధిదారుడు

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవం



నాగాయలంకలో కన్యకాపరమేశ్వరి మాతకు 108 కిలోల బియ్యంతో అభిషేకం



మచిలీపట్నం కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ



పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న వాసవీమాత

నాగాయలంక: శ్రీకన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ మహోత్సవాన్ని నాగాయలంకలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి సమన్విత పార్వతీ సమేత నగరేశ్వరస్వామి ఆలయం, జై వాసవీ యూత్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో తొలుత అమ్మవారి ఉత్సవ మూర్తి సమేతంగా 108 బిందెలతో కృష్ణానదికి తరలి వెళ్లిన ఆర్యవైశ్య మహిళలు, యూత్ సభ్యులు అర్చకుడు కొల్లిపర సుబ్బారావు నేతృత్వంలో నదీమతల్లికి పూజలు చేశారు. అక్కడి నుంచి నదీజలాన్ని బిందెల్లో సేకరించి ఊరేగింపుగా ఆలయానికి చేరారు. తొలుత ఉత్సవమూర్తికి 108 బిందెల కృష్ణాజలాలు, 108 కిలోల కొత్త బియ్యం, ఆవు పాలు, వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. కన్యకాంబ మూలవిరాట్‌కు అర్చకుడు కొల్లిపర సుబ్బారావు పసుపు, కుంకుమ, గంధంతో అభిషేకాలు జరిపి హారతులిచ్చారు. అష్టోత్తర సహస్రనామ కుంకుమార్చన, సంకర్షణ భజన మండలి సభ్యులతో సామూహిక వాసవీ నామ పారాయణం, నీరాజన మంత్రపుష్పం, అమ్మవారి పవళింపుసేవ, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. నాగాయలంక ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్యసంఘం సీనియర్ నాయకుడు చిట్టా పూర్ణచంద్రరావు, సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు, వాసవీ యూత్ ప్రతినిధి వంకాయల ఆదిరాజేష్, చిట్టా అన్నపూర్ణయ్య, మునగాల మోహనరావు, తాడికొండ సత్యనారాయణ, లేబాక నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం

పెడన: శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పద్దెనిమిది రకాల ద్రవ్యాలతో అమ్మవారికి మహాభిషేకం చేశారు. వాసవి మహిళా మండలి సభ్యులు అమ్మవారి చరిత్ర, శ్రీలలితాపారాయణం పఠించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ పర్యవేక్షణలో ఆలయంలో భక్తులకు ఏర్పాట్లును చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు స్వర్ణసాయిబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆజాద్‌రోడ్డులోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో సోమవారం అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారికి సుప్రభాతసేవ, కుంకుమార్చన తదితర పూజలు చేశారు. అమ్మవారి విగ్రహం వద్ద హోమం నిర్వహించారు. అమ్మవారి నగరవీధుల్లో ఊరేగించారు. ఆలయ కమిటీ బాధ్యులు మామిడి మురళీకృష్ణ, మోటమర్రి బాబాప్రసాద్, ఎస్.కాంతారావు, యు.శ్రీనివాసరావు, బి.హయగ్రీవరావు పాల్గొన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

నడకుదురు (చల్లపల్లి): వైఎస్సార్ సీపీ నేతృత్వంలోని ప్రభుత్వ పరిపాలనపై ఎవరు ఎన్ని దుష్ప్రచారాలు చేసినా వచ్చే ఎన్నికల్లో తమదే విజయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ బాధ్యతలు చేపడ్తారని స్పష్టం చేశారు. నడకుదురు శివారు పాతనడకుదురు గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు గ్రామంలోని 355 ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము సందర్శించిన ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందిన ఆనందం కనిపిస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఇస్తున్న సంతృప్తితో రెట్టించిన ఉత్సాహంతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వేమూరి గోవర్ధనరావు, మండల ఇన్‌చార్జి ఇంకొల్లు శేషగిరి, సర్పంచులు గొరిపర్తి సురేష్ బాబు, మాతంగి రమ్య, డొక్కు నాగేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, వల్లూరు ఉమా, ఎంపీటీసీ సభ్యులు డొక్కు దేవేంద్రరావు, మేకా బంగారు బాబు, పీఏసీఎస్ చైర్మన్ అరజా శివశంకర్, గ్రామ కన్వీనర్ జంపాన అంకమ్మ, పార్టీ నాయకులు మోపిదేవి ద్వారకానాథ్, గొరిపర్తి రమేష్, సజ్జా బలరాం, బొందలపాటి లక్ష్మి, పరుచూరి వెంకటేశ్వరరావు, మోదు మూడి కుటుంబరావు, మద్దాల వీరాస్వామి, ఏఎంసీ డైరెక్టర్ మోతుకూరి ఏడుకొండలు, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, మాతంగి దుర్గారావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రైతుకు అండగా జగనన్న ప్రభుత్వం

అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



గోదాము నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు తదితరులు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): రైతన్నకు అండగా రాష్ట్ర ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని కొక్కిలిగడ్డలో మల్టీపర్పస్ గోదాము నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. రంగుమారిన ధాన్యానికి తహసీల్దార్ నేతృత్వంలోని బృందం ధర నిర్ణయిస్తుందన్నారు. ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాన్ని నమ్మ వద్దని రైతులకు సూచించారు. మరోసారి జగనన్నను దీవించాలని కోరారు. అగ్రికల్చరల్ మార్కెటింగ్ డీఈ పి.నాగరాజు మాట్లాడుతూ 500 టన్నుల సామర్థ్యంతో ఎంపీఎఫ్‌సీ గోదాము నిర్మాణం చేపట్టామని తెలిపారు. నాబార్డ్ నిధులు 90 శాతం, కో–ఆపరేటివ్ బ్యాంకు నిధులు 10 శాతం కలిసి రూ.40 లక్షలతో గోదాము నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరరావు, కొలసాని వెంకటకృష్ణ, దిడ్ల రాంబాబు, ఎంపీటీసీ సనకా వెంకట రాజేష్‌బాబు, మత్తి లత, దిడ్ల రాణి, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు రాయన శంకరరావు, అరజా లక్ష్మీతులసి, తుటారం కృష్ణ, ఆది రాంబాబు, కార్యదర్శి మునిపల్లి నాగ మునీంద్రరావు తదతరులు పాల్గొన్నారు.

నేడు అజ్మీర్‌కు ముస్లింల పయనం

మచిలీపట్నంటౌన్: హజ్రత్ ఖాజా గరీబున్ నవాజ్ ఉరుసులో పాల్గొనేందుకు మచిలీపట్నం నుంచి ముస్లిం భక్తులు పవిత్ర అజ్మీర్ యాత్రకు మంగళవారం బయలుదేరనున్నారు. అజ్మీర్ యాత్రకు రైల్వే శాఖ ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది. ఈ రైలులో అజ్మీర్‌కు వెళ్లే భక్తులు నవాజ్‌కు సమర్పించేందుకు వైఎస్సార్ సీపీ తరఫున చాదర్ పంపనున్నట్లు పార్టీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా సోమవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సలార్‌దాదా ఆధ్వర్యంలో జవ్వారుపేటలోని హజ్రత్ షా షరీఫ్ ఖలందర్ బాబా దర్గాలో, అనంతరం పచ్చమేడ వద్ద ఉన్న ఖాజా గరీబ్ నవాజ్, మహబూబ్ సుబానీ జెండా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అక్కడి నుంచి తమ ఇంటి దగ్గరల్లో ఉన్న హజ్రత్ మీర్ హుస్సేన్ అలీషా ఖాదరీ దర్గాలో, జెండా సెంటర్‌లో ఉన్న మహబూబ్ సుబానీ జెండా దగ్గర, రాజుపేట కొత్త మసీదు నుంచి కోనేరుసెంటర్ మీదుగా పోర్టు రోడ్డు నుంచి వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటామని పేర్కొన్నారు. అక్కడి నుంచి ప్రత్యేక రైలులో అజ్మీర్ వెళ్లే భక్తులకు చాదర్‌ను అందజేస్తామని తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి

గూడూరు: వైఎస్సార్ జగనన్న కాలనీలో గృహనిర్మాణాలు వేగవంతం చేయాలని గూడూరు ఎంపీడీఓ డి.సుబ్బారావు సూచించారు. గృహనిర్మాణ శాఖ అధికారులతో కలసి ఆయన కప్పలదొడ్డి లే అవుట్‌ను సోమవారం పరిశీలించారు. గ్రామంలో 155 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 92 మందికి ఇంటి నిర్మాణ రుణాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఏడుగురు లబ్ధిదారులు పునాది వరకూ నిర్మాణాలు పూర్తిచేశారని, మరో పది మంది శంకుస్థాపన చేశారని పేర్కొన్నారు. మిగిలిన వారు కూడా త్వరగా గృహనిర్మాణాలు చేపట్టాలని కోరారు. సర్పంచి యక్కల మాధవి, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, వీఆర్వో వరప్రసాద్ పాల్గొన్నారు.

బాలోత్సవ్ వేడుకలు ప్రారంభం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, వెన్నా షైనీ

కోడూరు: స్థానిక స్వతంత్రపురం జెడ్పీ పాఠశాల క్రీడాప్రాంగణంలో బాలోత్సవ్ – 2023 సోమవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభను ఎంఈఓ టి.వి.ఎం.రామదాసు అధ్యక్షతన నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, పీఏసీఎస్ చైర్మన్ పరిశె మాధవరావు, ఎంపీటీసీ సభ్యుడు తిమ్మన నాంచారయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని బాలోత్సవ్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు విజ్ఞానం, మానసిక ఉల్లాసం, క్రీడా స్ఫూర్తి పెంపొందించేలా సాంస్కృతిక, క్రీడా, విద్యా విషయక అంశాల్లో పది రోజులపాటు పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ తెలిపారు. తొలిరోజు కబడ్డీ, త్రోబాల్, స్కిప్పింగ్, ఖోఖో పోటీలను జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన టీమ్‌లను ఎంపిక చేసి, మరోసారి ఫైనల్ పోటీలు నిర్వహిస్తామన్నారు. మంగళవారం కూడా క్రీడా పోటీలు జరుగుతాయి. జెడ్పీ హెచ్‌ఎం ఆలా రమణ, వైఎస్సార్ సీపీ నాయకుడు వెన్నా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: ఆదివెలమ శ్రేయోభివర్ధిని సంఘ మచిలీపట్నం శాఖ నూతన కార్యవర్గం ఎన్నికైంది. బలరామునిపేటలోని సంఘ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘ గౌరవాధ్యక్షుడిగా పిల్లారిశెట్టి శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా అంకాల వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా మాదిరెడ్డి రమేష్‌కుమార్, కార్యదర్శిగా మరకాని వాసు, కోశాధికారిగా పిల్లారిశెట్టి సత్యనారాయణ, అడ్వయిజరీ జాయింట్ సెక్రటరీగా మాదిరెడ్డి వీరబాబు, జాయింట్ సెక్రటరీలుగా కోకా మహేష్, పరిమి పాండురంగ అప్పలస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మాదిరెడ్డి ఈశ్వర్, సత్యనారాయణతో పాటు మరో ఎనిమిది మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా 2023 సంఘ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్, డైరెక్టర్ వందంశెట్టి రామ్మోహనరావు(రాము) తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఫౌండేషన్ ఆర్థిక సహాయం

గూడూరు: మండలంలోని తరకటూరుకు చెందిన అనుమలశెట్టి ఈశ్వరరావుకు మచిలీపట్నం వెలుగు ఫౌండేషన్ సోమవారం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేసింది. గత ఏడాది జరిగిన ప్రమాదంలో లారీ క్లీనర్‌గా పనిచేసే ఈశ్వరరావు వెన్ను ఎముకకు తీవ్ర గాయమై మంచానికే పరిమితమయ్యాడు. పేద కుటుంబానికి చెందిన అతని భార్య ముగ్గురు పిల్లలను పోషించడానికి దాతలు బడ్డీ సమకూర్చారు. వ్యాపారం ప్రారంభించడానికి వెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో చందమామ బాబు రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, గాజుల భగవాన్, నీలపాల ఫణికుమార్, షేక్ ఫిరోజ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఓటరు దినోత్సవ పోటీలు

పెడన: ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని పెడన నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు సోమవారం వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. పెడన ఎమ్మార్సీ భవనంలో ఈ పోటీలు జరిగాయి. ఎంఈఓ మెటల్దా రాణి పర్యవేక్షణలో ఉపాధ్యాయులు ఏసుమణి, నాయుడు, సత్యనారాయణ, రఘుబాబు, షణ్ముఖరావు, బాలాజీ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వక్తృత్వ పోటీల్లో కె.ఎస్.ఎన్.సుమ (విశ్వభారతి ఉన్నత పాఠశాల), జి.మహాలక్ష్మి (బీజీకే జెడ్పీహెచ్ఎస్), జోయ ముస్కాన్ (కళాంజలి), వ్యాసరచన పోటీల్లో అబ్దుల్ కౌసర్ (కళాంజలి), పి.ఉషాంజలి (బీజీకే జెడ్పీహెచ్ఎస్), వి.ఎన్.లలిత (విశ్వభారతి) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. క్విజ్‌లో బీజీజే జెడ్పీహెచ్ఎస్, కళాంజలి, విశ్వభారతి పాఠశాలల విద్యార్థి బృందాలు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలు మంగళవారం జిల్లాస్థాయి పోటీలకు హాజరుకావాలని ఎంఈఓ సూచించారు.